
సాక్షి ఆదిలాబాద్

శుక్రవారం । 24 । మార్చి । 2023



ఉత్తమ పంచాయతీలకు అవార్డులు

జాతీయ పంచాయతీ అవార్డులకు జిల్లాలోని పలు గ్రామపంచాయతీలు ఎంపికయ్యాయి. ఈ సందర్భంగా ఆయా సర్పంచులు, కార్యదర్శులను సన్మానించారు. 9లో▸



గరిష్టం/కనిష్టం
36.0/23.0

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు స్వల్పంగా పెరుగుతాయి. మధ్యాహ్నం ఉక్కపోతగా ఉంటుంది. గాలిలో తేమశాతం తగ్గనుంది.

న్యూస్‌రీల్

పౌర సరఫరాలశాఖ విజిలెన్స్ కమిటీ ఏర్పాటు

కైలాస్‌నగర్: జాతీయ ఆహార భద్రత చట్టం -2013 అమలులో భాగంగా ప్రజాపంపిణీ వ్యవస్థలో పారదర్శకతను పెంచేలా ప్రభుత్వం విజిలెన్స్ కమిటీల ఏర్పాటుకు ఆదేశించింది. ఇందులో భాగంగా ఆదిలాబాద్ రెవెన్యూ డివిజన్ విజిలెన్స్ కమిటీని ఏర్పాటు చేస్తూ ఆర్డీవో రమేశ్ రాథోడ్ గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. చైర్‌పర్సన్‌గా ఆర్డీవో, కన్వీనర్‌గా డివిజనల్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్, అధికారిక మెంబర్స్‌గా డివిజన్ పరిధిలోని తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్, జెడ్పీటీసీలు, బోథ్, ఆదిలాబాద్ ఐసీడీఎస్ సీడీపీవోలు, ఎస్సీ, ఎస్టీ, బీసీ వెల్ఫేర్ అధికారులు, రెవెన్యూ, సివిల్ సప్లయ్ డిప్యూటీ తహసీల్దార్లు ఉండనున్నారు. అలాగే నామినేటెడ్ సభ్యులుగా జైనథ్ మండలం గూడ ఎంపీటీసీ తోట రమ, బేల మండలం సాంగిడి ఎంపీటీసీ కుంట రాకేశ్, చౌకధరల దుకాణాల అసోసియేషన్ మండలాధ్యక్షుడు, నేరడిగొండ మండలం అరెపల్లికి చెందిన మేస్రం జంగుబాయి, ఆదిలాబాద్ పట్టణానికి చెందిన మర్రి విజయ, తార్పే తులసి, అబ్దుల్ సలీం నియమితులయ్యారు. ఈ కమిటీ ప్రతీ మూడు నెలలకోసారి సమావేశమై పౌరసరఫరాల శాఖ ద్వారా నిర్వహించే సరుకుల పంపిణీపై సమీక్షించనుంది. క్షేత్రస్థాయిలోనూ చౌక ధరల దుకాణాలను విజిట్ చేసి ప్రజాపంపిణీ వ్యవస్థను పర్యవేక్షించనున్నట్లు ఉత్తర్వుల్లో తెలిపారు.

పెన్‌గంగ పరీవాహక ప్రాంతాల్లో ఎన్డీఆర్ఎఫ్ బృందం



వివరాలు తెలుసుకుంటున్న అధికారులు

బేల: మండలంలోని పెన్‌గంగ పరీవాహక ముంపు ప్రాంతాలైన సాంగిడి, బెదోడ, కాంఘర్‌పూర్, గూడ, మణియార్‌పూర్ తదితర గ్రామాల్లో గురువారం ఎన్డీఆర్ఎఫ్ బృందం సభ్యులు, తహసీల్దార్ సర్ఫరాజ్ నవాజ్‌తో కలిసి పర్యటించారు. ఏటా వానాకాలంలో పెన్‌గంగ ఉధృతితో వచ్చే వరదలు, కలిగే నష్టాలు తదితర అంశాలపై ప్రజలతో మాట్లాడి ఆరా తీశారు. మణియార్‌పూర్‌లో ఎంపీపీ తాక్రే వనిత గంభీర్‌తో మాట్లాడి వరదతో ఏర్పడే సమస్యలు తెలుసుకున్నారు. వారి వెంట సర్వేయర్ గోవింద్, ఆర్ఐలు నారాయణ, గీత, బేల సహకార సంఘం చైర్మన్ పారట్‌కార్ బాలచందర్, సర్పంచులు ఉన్నారు.

'హామీ నిలబెట్టుకున్న సీఎం కేసీఆర్'



ఎమ్మెల్యేను సన్మానిస్తున్న సెర్ప్ ఉద్యోగులు

కైలాస్‌నగర్: గ్రామీణ ప్రాంతాల్లో పేదరిక నిర్మూలనకు కృషి చేస్తున్న సెర్ప్ ఉద్యోగులకు ఇచ్చిన హామీని సీఎం కేసీఆర్ నిలబెట్టుకున్నారని ఎమ్మెల్యే జోగు రామన్న పేర్కొన్నారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా పే స్కేల్‌ను ప్రకటించడాన్ని హర్షిస్తూ గురువారం సెర్ప్ జేఏసీ ఆధ్వర్యంలో ఎమ్మెల్యేను ఆయన క్యాంపు కార్యాలయంలో కలిశారు. పుష్పగుచ్ఛాన్ని అందజేసి శాలువాతో సత్కరించారు. సీఎం కేసీఆర్, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు ఫ్లెక్సీలకు పాలాభిషేకం చేసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ నిర్ణయం ద్వారా జిల్లాలోని 154 మంది ఉద్యోగులు లబ్ధి పొందనున్నారని పేర్కొన్నారు. ఏప్రిల్ నుంచి ఉద్యోగులతో సమానంగా పే స్కేల్ అమలు కానుందని తెలిపారు. సెర్ప్ ఉద్యోగుల సంఘం జేఏసీ అధ్యక్షుడు షుద్దోద్దీన్, ఏపీడీలు చరణ్‌దాస్, రాథోడ్ శేషారావు, హేమలత, వసంత, శోభారాణి, సుగంధ తదితరులు పాల్గొన్నారు.

నిందితులను కఠినంగా శిక్షించాలి

ఎదులాపురం: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం కాకినాడ జిల్లా తొండంగి మండలం శృంగవృక్షం గ్రామంలో నడిపల్లి రాము అనే దళిత యువకుడి హత్యకు కారకులైన అగ్రకుల దురహంకారులను కఠినంగా శిక్షించాలని కులవివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టీ స్కైలాబ్‌బాబు డిమాండ్ చేశారు. గురువారం స్థానిక సీఐటీయూ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. బాధిత కుటుంబానికి రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, రెండెకరాల భూమి, ఉద్యోగం, ఇంటి స్థలం, ఇల్లు, ఇతర బాధితులకు రూ.10 లక్షల పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి రెంజర్ల ప్రవీణ్, నాయకులు జితేందర్, స్వామి, రాహుల్ తదితరులు పాల్గొన్నారు.

అక్షర సమరం

సాక్షి CELEBRATING 15 YEARS



- జనం గొంతుకను వినిపిస్తున్న 'సాక్షి'
- ప్రజాసమస్యలు కళ్లకు కట్టేలా కథనాలు
- ప్రభుత్వ యంత్రాంగాన్ని కదిలించే వార్తలు
- జనాదరణతో నేడు 16వ వసంతంలోకి..

ఆదిలాబాద్‌టౌన్/కైలాస్‌నగర్: 'సాక్షి' పుట్టుకే ఓ సంచలనం.. గత 15 ఏళ్లలో అనేక కీలక ఘట్టాలను దాటి 16వ వసంతంలోకి నేడు అడుగిడుతోంది. మార్పులకు కీలకంగా నిలిచింది. అనేక కథనాలు ప్రచురించి ప్రజాసమస్యల పరిష్కారానికి చొరవ చూపింది. కలం అనే ఆయుధంతో సమాజంలో మార్పులు చోటుచేసుకునేలా కృషి చేసింది. జిల్లాలో సంస్కృతి, సంప్రదాయాలు, రాజకీయ కథనాలు, కబ్జాలు, నేరాలు.. ఘోరాలు, మానవీయ కోణం.. ఇలా వివిధ రకాల వార్తా కథనాలు ప్రచురించి బాధితులకు అండగా నిలిచింది. అక్రమార్కుల గుండెల్లో గుబులు రేకెత్తేలా చేయించింది. వారి ఆగడాలకు అడ్డుకట్ట వేసి కొరడా ఝుళిపించేలా చేసింది. అందరి మన్ననలు పొందుతూ మరో వసంతంలోకి అడుగు పెట్టింది. ఉదయాన్నే తలుపు తట్టి భిన్న వార్తలను పాఠకులకు అందిస్తోంది. నేడు 16వ వసంతంలోకి అడుగిడుతున్న వేళ ప్రత్యేక కథనం.

కథనాలు.. స్పందనలు

'చేయి తడిపినా రాని వేతనం'
ఈ శీర్షికన జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో స్టాఫ్ నర్సుల కష్టాలు వివరిస్తూ 2021 అక్టోబర్ 20న 'సాక్షి' కథనాన్ని ప్రచురించింది. ఒక్కో స్టాఫ్‌నర్సు నుంచి రూ.4వేల చొప్పున వసూలు చేయడాన్ని బహిర్గతం చేసింది. స్పందించిన అప్పటి కలెక్టర్, అడిషనల్ కలెక్టర్ రిజ్వాన్ బాషా ద్వారా విచారణ జరిపించారు. ఇద్దరు సీనియర్ అసిస్టెంట్లను సస్పెండ్ చేసి, ఇద్దరు సూపరింటెండెంట్ల సెక్షన్లు మార్చారు.

'గురువా ఇదేం గొడవా?'
విద్యాశాఖలో అనధికార డిప్యూటేషన్లపై 2022 డిసెంబర్ 29న కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈవో అనధికార డెప్యూటేషన్లను రద్దు చేశారు.

'భయం భయంగా.. శిథిల బడిలోనే పాఠాలు'
ఈ శీర్షికన 2022 జూలై 20న కథనం ప్రచురితమైంది. స్పందించిన అప్పటి కలెక్టర్ మన ఊరు–మన బడి ద్వారా మావల పాఠశాలకు అదనపు తరగతి గదులు మంజూరు చేస్తూ ఉత్తర్వులు జారీ చేశారు.

'విద్యాశాఖలో అక్రమార్కుడు'
విద్యాశాఖలో కొలువుల పేరిట ఓ జూనియర్ అసిస్టెంట్ చేసిన మోసాన్ని వివరిస్తూ గత జనవరి 21న కథనం ప్రచురితమైంది. స్పందించిన డీఈవో సదరు ఉద్యోగిని సెక్షన్ నుంచి తప్పించారు.

'గాడి తప్పిన విద్యాశాఖ'
గుడిహత్నూర్ పాఠశాలలలో కనీస సౌకర్యాలు లేకపోవడంతో గత జనవరి 30న కథనం ప్రచురితమైంది. స్పందించిన ఓ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధి గుడిహత్నూర్ పాఠశాలలో మరుగుదొడ్లు నిర్మించేందుకు ముందుకొచ్చారు. దీంతోపాటు ఈ విషయాన్ని డీఈవో, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు.

'రిమ్స్‌లో నిలిచిన సీటీ స్కాన్ సేవలు'
జిల్లా కేంద్రంలోని రిమ్స్ ఆస్పత్రిలో రెండు నెలలుగా సీటీ స్కాన్ యంత్రం మరమ్మతుకు నోచుకోని వైనంపై కథనం ప్రచురితమైంది. స్పందించిన అప్పటి కలెక్టర్ రిమ్స్‌ను సందర్శించి రెండురోజుల్లో సీటీస్కాన్ యంత్రం మరమ్మతు చేయించారు. దీంతో రోగుల ఇబ్బందులు తీరాయి.

'విద్యార్థులే ల్యాబ్ టెక్నీషియన్లు'
రిమ్స్ ఆస్పత్రిలో విద్యార్థులే ల్యాబ్ టెక్నీషియన్లుగా విధులు నిర్వహిస్తుండడాన్ని వివరిస్తూ కథనం ప్రచురితమైంది. రిమ్స్ డైరెక్టర్ స్పందించి ల్యాబ్ టెక్నీషియన్లు అందుబాటులో ఉండేలా చర్యలు చేపట్టారు.

'ముక్కుబడి పనులే'
మన ఊరు–మనబడి పనులు నత్తనడకన సాగుతుండగా 2023 ఫిబ్రవరి 27న కథనం ప్రచురితమైంది. కలెక్టర్ రాహుల్‌రాజ్ స్పందించి డీఈవో, ఎస్ఎంసీ, ప్రధానోపాధ్యాయులతో మరుసటిరోజు సమావేశమయ్యారు. 15రోజుల్లో పనులు పూర్తి చేయాలని ఆదేశించారు.

'మారని తీరు.. నీళ్లచారే దిక్కు'
ఆదిలాబాద్ అర్బన్, నేరడిగొండ కేజీబీవీల్లో ఆహారం వికటించి 105 మంది విద్యార్థుల అస్వస్థతకు గురి కాగా వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. దీంతో రెండు పాఠశాలల్లో పనిచేసే ఎస్వోలను అప్పటి కలెక్టర్ సస్పెండ్ చేశారు.

'రైతులకు నజరానాల ఎర'
వ్యాపారులు గ్రామాల్లో ముందస్తుగా విత్తనాలు విక్రయిస్తుండగా 2022 మే 13న కథనం ప్రచురితమైంది. స్పందించిన జిల్లా వ్యవసాయశాఖ అధికారులు గ్రామాల్లో అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. వ్యాపారులు గ్రామాల్లో విత్తనాలు విక్రయించవద్దని ఆదేశాలు జారీ చేశారు.

'మాస్ కాపీయింగ్‌ను అడ్డుకుంటే..'
డైట్ ప్రథమ సంవత్సరం పరీక్షల్లో మాస్ కాపీయింగ్ జరగగా కథనం ప్రచురితమైంది. దీనిపై డీఈవో స్పందించి పరీక్ష కేంద్రం వద్ద పోలీసు బందోబస్తు ఏర్పాటు చేసి పరీక్షలు నిర్వహించారు.

'ముడుపులిస్తేనే మ్యుటేషన్'
ఆదిలాబాద్ మున్సిపాలిటీలో మ్యుటేషన్ల జారీలో అధికారులు చేతివాటం ప్రదర్శిస్తుండడంపై 2022 అక్టోబర్ 31న కథనం ప్రచురితమైంది. రాష్ట్ర మున్సిపల్ అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ స్పందించారు. వరంగల్ ఆర్జేడీ షాహిద్ మసూద్‌ను విచారణ అధికారిగా నియమించగా ఆయన మ్యుటేషన్ల జారీలో జరుగుతున్న అక్రమాలపై విచారణ జరిపారు.

'సమస్యల్లో ఇండోర్ స్టేడియం'
జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియంలో వసతుల లేమిపై 2022 అక్టోబర్ 23న కథనం ప్రచురితమైంది. స్పందించిన మున్సిపల్ అధికారులు రూ.2కోట్లతో కొత్త భవన నిర్మాణ పనులు చేపట్టగా ప్రస్తుతం కొనసాగుతున్నాయి.



'రేషన్ డీలర్లు కావలెను'
జిల్లాలో సుదీర్ఘకాలంగా డీలర్లు లేని రేషన్‌షాపుల కారణంగా ప్రజలకు సకాలంలో సరుకులు అందని పరిస్థితిని వివరిస్తూ 2022 డిసెంబర్ 15న కథనం ప్రచురితమైంది. స్పందించిన అప్పటి కలెక్టర్ డీలర్ల భర్తీకి ఆదేశిస్తూ డిసెంబర్ 19 నుంచి దరఖాస్తులు స్వీకరించేలా ఉత్తర్వులు జారీ చేశారు. ప్రస్తుతం డీలర్ల భర్తీ జరగడంతో లబ్ధిదారుల ఇబ్బందులు తొలగిపోనున్నాయి.

'సీసీఐ ఆస్తులు స్వాహా'
జిల్లా కేంద్రంలోని కేంద్రప్రభుత్వ రంగ సీసీఐకి సంబంధించి రూ.కోట్ల విలువైన స్థలాలు, లైమ్‌స్టోన్ నిల్వలు కొల్లగొట్టి లేఅవుట్లు ఏర్పాటు చేస్తున్న వైనాన్ని వివరిస్తూ 2023 జనవరి 19న కథనం ప్రచురితమైంది. స్పందించిన రంగారెడ్డి జిల్లా తాండూర్ సీసీఐ నుంచి ముగ్గురు అధికారులతో కూడిన బృందం జిల్లా కేంద్రానికి చేరుకొని విచారణ చేపట్టారు. లేఅవుట్ పనులు నిలిచిపోగా, సీసీఐ ఆస్తులు సంరక్షించబడ్డాయి.

'ఆగని ఆక్రమణలు'
మావల మండలం దుర్గానగర్ కాలనీలో సర్వే నంబర్ 21లో ప్రభుత్వ భూమిని ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడంపై 2023 ఫిబ్రవరి 15న కథనం ప్రచురితమైంది. స్పందించిన కలెక్టర్ రాహుల్‌రాజ్ దీనిపై విచారణ చేపట్టి చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు మావల రెవెన్యూ, మున్సిపల్ అధికారులు ఆక్రమణలను కూల్చివేసి రూ.కోట్ల విలువైన భూమిని ప్రభుత్వ అధీనంలోకి తీసుకున్నారు.

మరికొన్ని..

- ఏజెన్సీలో 2013లో ప్రబలిన విషజ్వరాలను 'సాక్షి' వెలుగులోకి తెచ్చింది. ఆ తర్వాత అప్పుడున్న జిల్లా యంత్రాంగం, అధికారులు 30 వైద్య బృందాలను నియమించి వైద్యశిబిరాలు ఏర్పాటు చేశారు. 'సాక్షి' కథనం కారణంగా గిరిజనులకు తక్షణ వైద్యసాయం అందింది.
- 2011లో ఉమ్మడి జిల్లా డీఈవోగా పనిచేసిన జయచంద్రకుమార్ యూపీఎస్ పాఠశాలల బోధనోపకరణా నిధులను కాజేసిన వైనంపై 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీనికి స్పందించిన అప్పటి సర్వశిక్షా అభియాన్ ఎస్పీడీ విచారణ చేపట్టి అతడిని సస్పెండ్ చేశారు.
- 2012లో ఇన్‌చార్జి డీఈవోగా పనిచేసిన డిప్యూటీ డీఈవో కే జాషువా బదిలీ, పదోన్నతుల్లో అక్రమాలకు పాల్పడ్డాడు. ఆ అక్రమాలకు సంబంధించి 'సాక్షి'లో కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు ఆయనను సస్పెండ్ చేశారు.
- పంపకాల్లో వచ్చిన తేడా కారణంగా ఇటీవల జైనథ్ మండలం భోరజ్ చెక్‌పోస్టుకు సంబంధించిన వరుస కథనాలు 'సాక్షి'లో ప్రచురితమయ్యాయి. ఈ విషయం ఉన్నతాధికారులతోపాటు సీఎం కేసీఆర్ దృష్టికి వెళ్లింది. దీంతో దీనిపై విచారణ జరుపుతున్నారు.
- ఆదిలాబాద్ పట్టణంలోని అంబేద్కర్ నగర్‌కు చెందిన అక్కా చెల్లెల్లు ఏళ్లపాటు వారి ఇంట్లోనే స్వీయ నిర్బంధంలో ఉన్నారు. వారికి తల్లిదండ్రులు లేకపోవడంతో బయటకు రాకుండా ఉన్నారు. ఈ విషయం 'సాక్షి'లో ప్రచురితం కాగా, వారికి ఐసీడీఎస్ అండగా నిలిచింది. దీంతోపాటు పలువురు స్వచ్ఛంద సంస్థలు ఆర్థికసాయాన్ని అందజేశాయి.

కదిలించిన కథనాలు..

- 'సాక్షి'లో వచ్చిన కథనాలు అధికారులను కదిలించాయి. జిల్లా విద్యాశాఖాధికారులు స్పందించి తరచూ కేజీబీవీలను సందర్శిస్తున్నారు. రాత్రి వేళ భోజనం ఎలా పెడుతున్నారనే విషయాలపై సెక్టోరల్ అధికారుల ద్వారా తనిఖీలు చేయిస్తున్నారు. గతంలో 'సాక్షి'లో ప్రచురితమైన వార్తలకు ఇద్దరు కేజీబీవీ ప్రత్యేక అధికారులపై సస్పెన్షన్ వేటు వేసిన విషయం తెలిసిందే.
- డీఈవో కార్యాలయంలో పనిచేస్తున్న ఓ ఉద్యోగి మెడికల్ బిల్లుల్లో అక్రమాలకు పాల్పడుతున్నారన్న కథనంతో ఆ శాఖలో తీరు మారింది. సదరు ఉద్యోగిని ఆ సెక్షన్ నుంచి తప్పించి మరో ఇద్దరు ఉద్యోగులకు బాధ్యతలు అప్పగించారు. ప్రస్తుతం మెడికల్ బిల్లులు పకడ్బందీగా చేపడుతున్నారు.

ఊరొదిలి వెళ్లేవారిని ఆపించి..



తాంసి: ఆర్నెళ్ల క్రితం భీంపూర్ మండలం కమట్‌వాడ పంచాయతీ పరిధి గోవింద్‌పూర్ గిరిజన గ్రామంలో వరుస మరణాలు సంభవించాయి. దీనిని కీడుగా భావించిన గ్రామస్తులు భయంతో ఒక్కొక్కరుగా గ్రామాన్ని వీడిపోతున్నారు. దీనిపై గత నవంబర్ 4న 'ఊరొదిలిపోతున్నారు' శీర్షికన 'సాక్షి'లో ప్రచురించిన కథనానికి జిల్లా అధికార యంత్రాంగం స్పందించింది. వివిధ శాఖల అధికారులను అప్రమత్తం చేసి గ్రామానికి పంపింది. అధికారులు గ్రామాన్ని సందర్శించి గ్రామస్తులకు అవగాహన కల్పించారు. ఐసీఎంఆర్ ఆధ్వర్యంలో వైద్యశిబిరం నిర్వహించారు. గ్రామస్తులకు రక్త పరీక్షలు చేశారు. మూఢ నమ్మకాలు వీడాలని సూచించారు. గ్రామస్తులకు సరైన వసతులు కల్పిస్తామని హామీ ఇవ్వగా మిగతా గ్రామస్తులంతా గ్రామంలోనే నివాసముంటున్నారు.

'సాక్షి' చొరవ అభినందనీయం



'సాక్షి' దినపత్రిక అనేక అక్రమాలను వెలికితీస్తోంది. రిమ్స్‌లో సీటీస్కాన్ సేవలు నిలిచిపోగా కథనం ప్రచురితమైంది. దీంతో అధికారులు స్పందించి వాటికి మరమ్మతు చేయించి రోగులకు అందుబాటులోకి తీసుకొచ్చారు. బేలలో ల్యాబ్‌టెక్నీషియన్లపై ఇచ్చిన కథనానికి వైద్యాధికారులు స్పందించారు. మొరం తవ్వకాలు, భూ కబ్జాలు తదితర కథనాలు వచ్చాయి. దీంతోపాటు ప్రజా సమస్యలు నిరంతరం వెలుగులోకి తీసుకువస్తోంది. 15వ వసంతంలోకి అడుగు పెడుతున్న 'సాక్షి' సేవలు అభినందనీయం.– రూపేశ్‌రెడ్డి,
యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ కార్యదర్శి

స్పందన కొనసాగాలి



జిల్లా కేంద్రంలోని ఇండోర్ స్టేడియం దుస్థితిపై 'సాక్షి' దినపత్రికలో కథనం ప్రచురితమైంది. దానికి అధికారులు స్పందించి కొత్త భవనం మంజూరు చేశారు. ప్రస్తుతం ఆ పనులు కొనసాగుతుండడం అభినందనీయం. ప్రజా సమస్యలు వెలికితీయడంలో 'సాక్షి' ప్రత్యేకతను చాటుకుంటోంది. భవిష్యత్‌లోనూ ఇదే స్ఫూర్తిని కొనసాగించాలి.
– లోక ప్రవీణ్‌రెడ్డి,
బీజేపీ జిల్లా అధికార ప్రతినిధి

1098కు సమాచారం ఇవ్వాలి



పసిపాపతో క్షమాదేశ్ పాండే

ఆదిలాబాద్‌రూరల్: పసి పాపకు ఏదైనా అవసరమైతే చైల్డ్‌లైన్ 1098 నంబర్‌కు లేదా బాలల పరిరక్షణ విభాగానికి సమాచారం అందించాలని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి క్షమాదేశ్ పాండే సూచించారు. చిచ్‌ధరి ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధి రాజుగూడ గ్రామంలో తల్లిని కోల్పోయిన పాప ఆరోగ్యంపై గురువారం గ్రామానికి వెళ్లి ఆరా తీశారు. బాలల పరిరక్షణ విభాగం ఆధ్వర్యంలో పాపకి 10 జతల దుస్తులు, పాల డబ్బాలు అందజేశారు. నిత్యావసరాలు, సరుకులు, ఇతర సామగ్రిని ఆదిలాబాద్‌లో అందజేస్తామని పాప కుటుంబ సభ్యులకు బాలల పరిరక్షణ విభాగం అధికారులు పేర్కొన్నారు. పాపకి ఎలాంటి వైద్య చికిత్స అవసరమైనా, వసతి, పోషణ సౌకర్యం కల్పించడానికి సిద్ధంగా ఉన్నామని పాప కుటుంబ సభ్యులకు భరోసా కల్పించారు. అయితే పాపను తమ వద్దకు తీసుకువస్తే పోషణ బాధ్యత చూసుకుంటామని బాలల పరిరక్షణ విభాగం అధికారులు పేర్కొనడంతో ఆమె కుటుంబ సభ్యులు నిరాకరించారు. ప్రస్తుతం తామే పోషణ బాధ్యత తీసుకుంటామని చెప్పారు. ఈమె వెంట బాలల పరిరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, చైల్డ్‌లైన్ 1098 జిల్లా కోఆర్డినేటర్ తిరుపతి, స్వామి, స్వప్న, తదితరులున్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

కైలాస్‌నగర్: అకాల వర్షాలకు పంట నష్టపోయిన రైతులను ఆదుకోవాలని బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినీరెడ్డి డిమాండ్ చేశారు. రైతుల వారీగా సర్వే నిర్వహించి పరిహారం అందించాలని కోరుతూ గురువారం కలెక్టర్ రాహుల్‌రాజ్‌కు వినతిపత్రం అందజేశారు. జిల్లాలోని పలు ప్రభుత్వ పాఠశాలల్లో మూత్రశాలలు, తాగునీరు లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఆదిలాబాద్ రూరల్ మండలం పొచ్చెర జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో ట్రాన్స్‌ఫార్మర్‌తో విద్యార్థులు తీవ్ర ఇబ్బంది పడుతున్నారని, సమస్య పరిష్కరించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు సతీశ్‌రెడ్డి, మోహన్, క్రాంతికుమార్, నరేశ్, అశాంత్ తదితరులున్నారు.

'ఆయుష్మాన్‌భారత్‌ను అడ్డుకుంటున్న ప్రభుత్వం'



అవగాహన కల్పిస్తున్న పాయల్ శంకర్

ఆదిలాబాద్: కేంద్ర ప్రభుత్వ ఆయుష్మాన్ భారత్ పథకాన్ని నిరుపేదలకు అందకుండా బీఆర్ఎస్ ప్రభుత్వం అడ్డుకుంటోందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ ఆరోపించారు. జిల్లా కేంద్రంలోని పలు వ్యాపార సముదాయాల్లో ఆయుష్మాన్ భారత్ పథకంపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. నిరుపేదలకు మెరుగైన వైద్యం అందించాలనే ఉద్దేశంతో.. అత్యవసర సమయాల్లో వారికి అండగా నిలిచేందుకు కేంద్ర ప్రభుత్వం ఆయుష్మాన్ భారత్ పథకానికి శ్రీకారం చుట్టిందని పేర్కొన్నారు. అయితే రాష్ట్ర ప్రభుత్వం పథకం గురించి ప్రజలకు అవగాహన కల్పించకుండా నిరుపేదలకు పథకాన్ని దూరం చేసేలా వ్యవహరిస్తోందని ఆరోపించారు. ఆయుష్మాన్ భారత్ పథకంలో నమోదు చేసుకుంటే రూ.5 లక్షల వరకు దేశంలో ఎక్కడైనా వైద్య చికిత్స ఉచితంగా చేసుకోవచ్చని సూచించారు. అయితే ఈ పథకాన్ని ప్రజల్లోకి తీసుకువెళ్తే బీజేపీకి ప్రజలు ఓట్లు వేస్తారని బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులు భయపడుతున్నారని ఎద్దేవా చేశారు. దేశంలోని సుమారు 50 కోట్ల ప్రజలకు ఆయుష్మాన్ భారత్ పథకం అండగా నిలుస్తోందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం పథకాన్ని ఎంత దాచాలని ప్రయత్నించినా, ప్రజలకు వాస్తవాలు తెలుస్తాయని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా పలువురితో ఆయుష్మాన్ భారత్ పథకంలో రిజిస్ట్రేషన్ చేయించారు. నాయకులు జోగు రవి, దినేశ్ మటోలియా, ఆకుల ప్రవీణ్, రాజేశ్, కృష్ణయాదవ్, శ్రీనివాస్, రాము తదితరులు పాల్గొన్నారు.

జనసంద్రంగా దీక్షభూమి



పాదయాత్రలో జెడ్పీ చైర్మన్, దీక్ష గురువు, భక్తులు

నార్నూర్: మండలంలోని కొత్తపల్లి–హెచ్ గ్రామంలోగల బంజారా జాతీయ దీక్షభూమి జనసంద్రమైంది. గురువారం దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్ ఆధ్వర్యంలో చేపట్టిన సేవాదశ్ మహాపాదయాత్రను జెడ్పీచైర్మన్ రాథోడ్ జనార్దన్ ప్రారంభించారు. ఆయన కూడా సేవాలాల్ మహరాజ్ దీక్ష స్వీకరించి మహాపాదయాత్రలో భాగస్వామి కావాలని సంకల్పించినట్లు ప్రకటించారు. తెలంగాణతోపాటు మహారాష్ట్ర, కర్ణాటక తదితర రాష్ట్రాల నుంచి భక్తులు, బంజారాలు భారీగా తరలిరాగా ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. జెడ్పీ చైర్మన్ మాట్లాడుతూ.. దేశంలోనే ఏకైక జాతీయ బంజారా దీక్ష భూమి కొత్తపల్లి–హెచ్ గ్రామంలో ఉందని తెలిపారు. ఈ నెల 23నుంచి 29 వరకు దీక్ష భూమి నుంచి మహారాష్ట్రలోని పొరఘులో సేవాదశ్ వరకు పాదయాత్ర చేపడుతున్నట్లు తెలిపారు. దాదాపు 275కిలో మీటర్లు ఉండగా ప్రతీరోజు 25 కిలో మీటర్లు యాత్ర చేయాలని నిర్ణయించినట్లు పేర్కొన్నారు. దీక్ష గురువు శ్రీసంత్ ప్రేంసింగ్ మహరాజ్, జెడ్పీ చైర్మన్‌ను మండల కేంద్రంలోని గాంధీచౌక్ వద్ద స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్ ఆధ్వర్యంలో సన్మానించారు. విజయ్‌నగర్ కాలనీలో శ్రీసంత్ తపస్వి రామారావు విగ్రహ ఏర్పాటుకు భూమిపూజ చేశారు. పీఏసీఎస్ చైర్మన్ అడే సురేశ్, చౌహాన్, యశ్వంత్‌రావు చౌహాన్, బాలమోహన్, జ్ఞానోబా పుస్కర్, సీకేందర్ మహేందర్ చౌహాన్, దిలీప్ రాథోడ్, సుమారు ఐదువేల మంది సేవాలాల్ భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గొల్లమాడ యువకుడికి కాంస్య పతకం


ట్రోఫీతో లక్ష్మణ్

నర్సాపూర్(జి): మండలంలోని గొల్లమాడ గ్రామానికి చెందిన నాకిడి లక్ష్మణ్ ఈ నెల 15,16,17 తేదీల్లో రాజస్థాన్ రాష్ట్రంలోని జైపూర్ పట్టణంలో జరిగిన జాతీయ స్థాయి సీనియర్ స్మాష్ రాకెట్ పోటీలలో తెలంగాణ జట్టు తరుపున ప్రతిభ కనబర్చి కాంస్య పతకం గెలుపొందాడు. సదరు యువకుడిని తెలంగాణ స్మాష్ రాకెట్ సెక్రటరీ పులి మధు అభినందించి సన్మానించారు. కుటుంబ సభ్యులు, గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

ఒకరి మృతికి కారణమైన వ్యక్తికి జైలు

భైంసాటౌన్: అజాగ్రత్తగా వాహనం నడిపి ఒకరి మృతికి కారణమైన గందం ఉత్తమ్ అనే వ్యక్తికి జైలు శిక్ష విధిస్తూ భైంసా ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్ కోర్టు న్యాయమూర్తి జితిన్‌కుమార్ గురువారం తీర్పునిచ్చారు. వివరాల ప్రకారం... హెడ్‌కానిస్టేబుల్ బానోత్ రణజా, పెందూర్ విఠల్‌లు భైంసాలో మున్సిపల్ ఎన్నికల విధులు ముగించుకుని బైక్‌పై నిర్మల్ వైపు వెళ్తున్నారు. 2014 ఆగస్టు 3న రాత్రి 8.15 గంటల ప్రాంతంలో భైంసా మండలం వానల్‌పాడ్‌కు చెందిన గందం ఉత్తమ్ బైక్‌పై వస్తూ భైంసాలోని విష్ణుప్రకాశ్ ఫ్యాక్టరీ వద్ద వెనుక నుంచి ఢీకొట్టాడు. దీంతో బానోత్ రణజా తలకు తీవ్ర గాయమై మృతి చెందాడు. భైంసా పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదైంది. ఎనిమిది మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టగా నేరం రుజువు కావడంతో నేరస్తుడు గందం ఉత్తమ్‌కు నాలుగు నెలల సాధారణ జైలు శిక్షతోపాటు రూ.2వేల జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పునిచ్చారు.

గంజాయి విక్రేతలకు మూడేళ్ల జైలు

ఆదిలాబాద్‌టౌన్: గంజాయి తరలిస్తూ పట్టుబడ్డ కేసులో ఇద్దరు వ్యక్తులకు ఫస్ట్ అడిషనల్ సెషన్ కోర్టు జడ్జి జైలు శిక్ష, జరిమానా విధిస్తూ తీర్పునిచ్చారు. వివరాల్లోకి వెళ్తే.. ఆసిఫాబాద్ జిల్లా జైనూర్ మండలానికి చెందిన రాథోడ్ ప్రకాష్, నార్నూర్ మండలం తడిహత్నూర్‌కు చెందిన రాథోడ్ రమేశ్ ఇద్దరు చేనులో గంజాయి పండిచి అధిక డబ్బులు సంపాదించాలనుకున్నారు. ఇదే ఉద్దేశంతో గంజాయిని తరలిస్తుండగా ఉట్నూర్ బస్టాండ్‌లో ఎస్సై సుబ్బారావు పట్టుకుని వారిపై కేసు నమోదు చేశారు. సీఐ నరేశ్ కుమార్ 12 సాక్షులను విచారించి చార్జీషీట్ ఫైల్ చేశారు. కాగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ మేకల మధుకర్, కోర్టు కానిస్టేబుల్ నరేందర్ 12మంది సాక్షులను కోర్టులో ప్రవేశ పెట్టి నేరం రుజువు చేశారు. దీంతో జడ్జి గురువారం ఇరువురికి మూడేళ్ల జైలు శిక్ష, రూ.5వేల చొప్పున జరిమానా విధిస్తూ తీర్పు నిచ్చారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

తానూరు: మండల కేంద్రానికి చెందిన కల్లూరు రాములు(60) చికిత్స పొందుతూ హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రిలో మృతిచెందినట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం... ఈ నెల 19వ తేదీన ధర్మాబాద్ రోడ్డులో రాత్రి ఇండియన్ పెట్రోల్ పంప్ సమీపంలో ద్విచక్ర వాహనం ఢీకొని కల్లూరు రాములు తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబీకులు హైదరాబాద్‌లోని గాంధీ ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ పరిస్థితి విషమించి గురువారం మృతి చెందాడు. కుటుంబీకుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై విక్రమ్ తెలిపారు.

ఉరేసుకుని వివాహిత ఆత్మహత్య

బేల: ఉరేసుకుని వివాహిత ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన గురువారం మండలంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం... జూనోని గ్రామానికి చెందిన నాగోసే శంకర్ భార్య విద్య (30) రెండేళ్లుగా అనారోగ్యంతో బాధపడుతోంది. పలు ప్రైవేటు ఆస్పత్రుల్లో చూపించినప్పటికీ నయం కాలేదు. దీంతో మానసికంగా కుంగిపోయింది. గురువారం ఉదయం చూసేసరికి వంట గదిలో ఉరేసుకుని కనిపించింది. మృతురాలికి ఇద్దరు కుమారులున్నారు. మృతురాలి తమ్ముడు షిండే రికాజీ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్సై లింగన్న తెలిపారు.

వన్యప్రాణులకు జలసౌకర్యం

- సహజసిద్ధమైన నీటిని అందించేందుకు చర్యలు
- నీటికుంటలు, ర్యాంప్‌వెల్స్, సోలార్ పంపులు వినియోగం
- ఎత్తైన ప్రదేశాల్లో సాసర్ వెల్స్ ఏర్పాటు


ర్యాంప్‌వెల్‌లోని నీటిని తాగుతున్న వన్యప్రాణులు

జన్నారం(ఖానాపూర్): వేసవికాలం సమీపించడంతో రోజురోజుకూ ఎండల తీవ్రత పెరుగుతోంది. కవ్వాల్ టైగర్‌జోన్‌లో వన్యప్రాణుల దాహార్తి తీర్చేందుకు అధికారులు చర్యలు మొదలుపెట్టారు. మూగజీవాలకు సహజసిద్ధమైన నీటిని అందించేందుకు పనులు ప్రారంభిస్తున్నారు. నిల్వ ఉన్న నీటితో పాటు సహజసిద్ధమైన జలధారలు, వాగుల్లోని నీటిని వన్యప్రాణులు ఇష్టంగా తాగే అవకాశం ఉంది. దీంతో అడవిలో నీటికి కొరత లేకుండా జలధారలు, నీటి చెలిమలు, వాగుల నీటిని అందించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. వాటితో పాటు నీటికుంటల ద్వారా, ర్యాంప్‌వెల్‌లు, సోలార్ పంపులు, సాసర్ వెల్స్ ద్వారా నీటిని అందించనున్నారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లో ఖానాపూర్, జన్నారం, మంచిర్యాల, చెన్నూర్, బెల్లంపల్లి అటవీ డివిజన్లలో టైగర్ ప్రాజెక్ట్ ఫీల్డ్ డైరెక్టర్ వినోద్‌కుమార్ ఆదేశాల మేరకు నీటిసౌకర్యంపై అధికారులు దృష్టి సారించారు.

నీటికుంటలపైనే దృష్టి

అటవీ ప్రాంతాల్లో భూగర్భ జలాలను పెంచడంలో భాగంగా వర్షపునీరు వృథాగా పోకుండా ఉండేందుకు అధికారులు నీటికుంటలపై దృష్టి పెట్టారు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో 300 వరకు నీటి కుంటలు ఉన్నాయి. అందులో ప్రస్తుతం 190 నీటికుంటల్లో నీరు నిల్వ ఉంది. మే మాసం వరకు 80 నీటికుంటల్లో నీరు నిల్వ ఉండే అవకాశం ఉంది. కోర్ ఏరియాలో నీటి కుంటలను అధికంగా నిర్మించారు. కురిసిన వర్షాలకు కుంటల్లో నీరుచేరి అందులోనే ఇంకిపోతే భూగర్భజలాలు పెరగడంతో పాటు వన్యప్రాణులకు నీటిసౌకర్యం ఉంటుంది.

సాసర్ వెల్స్ ద్వారా నీటిసౌకర్యం

నీటి కుంటలు, సోలార్ పంపులు, ర్యాంప్‌వెల్స్ లేని ప్రదేశాల్లో ఎత్తైన ప్రాంతంలో సీసీ సాసర్‌వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. అందులోకి ట్యాంకర్ ద్వారా నీటిని నింపి వన్యప్రాణులకు అందిస్తున్నారు. అయితే గతంలో జన్నారం అటవీ డివిజన్‌లో అత్యధికంగా సాసర్ల ద్వారా నీటిని అందించేవారు. దీంతో ట్రాక్టర్ శబ్దానికి వన్యప్రాణులు భయపడే అవకాశం ఉండడంతో వీటి వినియోగం తగ్గించేలా చర్యలు తీసుకుంటున్నారు. జన్నారం అటవీ డివిజన్‌లో వంద సాసర్‌వెల్స్ ఉండగా ఈ ఏడాది 25 మాత్రమే వినియోగించే అవకాశం ఉంది.

మిషన్ భగీరథ నీరు వినియోగం

అడవిలో నుంచి మిషన్ భగీరథ పైపులు వేస్తున్నారు. దీంతో భగీరథ నీటిని కూడా వన్యప్రాణులకు ఉపయోగించేలా అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. మహ్మదాబాద్, చింతగూడ బీట్‌లలో భగీరథ నీటితో కుంటలు నింపి వాటిని వన్యప్రాణులకు ఉపయోగిస్తున్నారు. జింకల పునరావాస కేంద్రంలో సైతం భగీరథ నీటితో కుంటలు నింపడమే కాకుండా గడ్డి పెంపకం కూడా చేపట్టారు. కన్హ రిజర్వ్ ఫారెస్ట్‌లో పర్యటన అనంతరం నూతనంగా ఏర్పడ్డ కవ్వాల్ టైగర్ ప్రాజెక్టులో కూడా అభివృద్ధి జరిపి వన్యప్రాణుల సంఖ్య పెంచేందుకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు.

వాగులకు ఆనకట్టలు

మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని కన్హా టైగర్‌జోన్‌లో ఉన్న మాదిరి కవ్వాల్ టైగర్‌జోన్‌లో కూడా వాగులకు ఆనకట్టలు వేసి సహజసిద్ధమైన నీటిని అందించేందుకు అధికారులు పనులు ప్రారంభించారు. ఇందులో భాగంగా ప్రవహించే వాగునీటికి ఆనకట్టలు కడుతున్నారు. వాగునీటికి అడ్డంగా బండ రాళ్లు, ఇసుకతో కట్టకట్టడంతో నీరు నిలిచి చెలిమెలా తయారవుతుంది. పారే నీరు శుభ్రంగా ఉండడంతో వన్యప్రాణులు ఇష్టపడుతాయి. జన్నారం డివిజన్‌లో గతేడాది 30 చోట్ల ఆనకట్టలు కట్టారు. ఈ ఏడాది వాటిసంఖ్య పెంచనున్నారు.


వాగులో ఏర్పాటు చేసిన ఆనకట్ట

ర్యాంప్‌వెల్స్

నీటి ఊటలు ఉన్న ప్రదేశంలో మూడు మీటర్ల లోతు, పది మీటర్ల వెడల్పుతో గుంత తవ్వుతారు. అందులోకి స్వచ్ఛమైన నీరు ఊరడంతో ప్రాణులు తాగేందుకు ఇష్టపడుతాయి. గుంతకు రెండు వైపులా ర్యాంపులు ఏర్పాటు చేయడంతో వన్యప్రాణులు అందులో దిగి నీటిని తాగుతాయని అధికారులు పేర్కొంటున్నారు. గతేడాది ఇలాంటివి 20 వరకు తీసారు. ఈ ఏడాది మరో 25 చోట్ల ర్యాంప్‌వెల్స్ ఏర్పాటు చేయనున్నట్లు అధికారులు పేర్కొన్నారు.

సోలార్ పంపులు

కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో సోలార్ విద్యుత్ ద్వారా నడిచే పంపులతో నీటిసౌకర్యం కల్పిస్తున్నారు. వేసవికాలంలో ఎండల తీవ్రతకు కుంటల్లో నీరు ఇంకిపోయే అవకాశం ఉన్నందువల్ల 18 సోలార్ పంపుల ద్వారా నీటిని వదులుతున్నారు.

నీటిసౌకర్యం కల్పించేందుకు చర్యలు



అడవిలో నివసించే వన్యప్రాణులకు ఆహారంతో పాటు నీటిసౌకర్యం కల్పించేందుకు పలురకాల చర్యలు చేపట్టాం. అడవిలోని వాగుల్లో ప్రవహించే నీటికి ఆనకట్టలు కట్టడం, ర్యాంప్‌వెల్స్ ద్వారా సహజసిద్ధమైన నీటిని అందిస్తున్నాం. ఎత్తైన ప్రాంతాల్లో గుట్టల నుంచి వచ్చే జలధారల నీటిని వినియోగించే ఏర్పాట్లు చేస్తున్నాం.

– సిరిపురం మాధవరావు, డెప్యూటీ కన్జర్వేటర్

ఆ స్థలం వారిదే...

- 23 ఏళ్ల తర్వాత కోర్టు సంచలన తీర్పు
- రోడ్డు బ్లాక్‌తో నిలిచిన రాకపోకలు


రోడ్డుపై బారికేడ్లను ఏర్పాటు చేసి రాకపోకలు నిలపివేసిన దృశ్యం

కై లాస్‌నగర్: ఆదిలాబాద్ జిల్లా కేంద్రంలోని ఓ స్థలం విషయంలో వచ్చిన కోర్టు తీర్పు సంచలనంగా మారింది. సినిమా రోడ్ సమీపంలోని అన్నభావు సాఠే విగ్రహం నుంచి మున్సిపల్ కార్యాలయం వైపుగా వెళ్లే రోడ్డుకిరువైపులా బారికేడ్లను ఏర్పాటు చేసి ఈ స్థలం తమదేనంటూ గురువారం ఫ్లెక్సీని ఏర్పాటు చేయడం కలకలం రేపింది. రాణీ సతీజీ కాలనీ సమీపంలోని సాయి పంచవటి హోటల్‌తో పాటు దానిని ఆనుకుని ఉన్న దుకాణాల స్థలం గతంలో సోమా గంగారెడ్డితో పాటు వారికి సంబంధించినదని అతడి తనయుడు సోమ రవి తెలిపారు. రికార్డుల్లో ఈ భూమి తమ పేరిటే ఉందని తెలిపాడు. అయితే ఈ స్థలాన్ని గతంలో ఓ వైద్యుడు ఇతరులకు విక్రయించాడని, దీంతో తాము 23ఏళ్లుగా పోరాడుతున్నామని, తాజాగా ఈ భూమిపై అన్ని హక్కులు సోమ గంగారెడ్డి కుటుంబీకులకే ఉన్నట్లుగా కోర్టు ఇచ్చిందని తెలిపాడు. కోర్టు తీర్పు మేరకు 33 గుంటలతో కూడిన ఈ భూమిని తమ అధీనంలోకి తీసుకుని బారికేడ్లను ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నాడు. దీంతో పాటు దిస్ ల్యాండ్ బిలాంగ్స్ టు సోమ గంగారెడ్డి అండ్ అదర్స్ అన్ని ఫ్లెక్సీ ఏర్పాటు చేశాడు. దీనిని గమనించిన వాహనదారులు, పాదచారులు, షాపుల నిర్వాహకులు పెద్ద ఎత్తున అక్కడకు తరలివచ్చారు. షాపుల, హోటల్ నిర్వాహకులు సైతం వెళ్లేందుకు ఇబ్బందులు పడడంతో ఎలాంటి ఘర్షణలు జరుగకుండా ఎస్సై హరిబాబు ఆధ్వర్యంలో సాయుధ పోలీసులు ఉదయం నుంచి రాత్రి వరకూ బందోబస్తు చేపట్టారు.

మోదీ పాలనలో నిరుద్యోగం



మాట్లాడుతున్న రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య


మైక్ కట్‌చేస్తున్న పోలీసులు

- సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వీరయ్య
- జిల్లా కేంద్రానికి జన చైతన్య యాత్ర
- సభను అడ్డుకున్న పోలీసులు
- కాసేపు గందరగోళంగా సభ ప్రాంగణం

నిర్మల్‌టౌన్: 50ఏళ్లలో ఎప్పుడూ లేని విధంగా మోడీ పాలనలో నిరుద్యోగం పెరిగిందని సీపీఐ(ఎం) రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎస్.వీరయ్య అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట సీపీఐ(ఎం) రాష్ట్ర కమిటీ చేపట్టిన జన చైతన్య యాత్రలో భాగంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వీరయ్య మాట్లాడారు. దేశ మంటే అదాని, అంబానీ సొత్తుగా మార్చేశారన్నారు. గుజరాత్‌లో మోడీ ముఖ్యమంత్రి అయ్యే నాటికి రూ.17వేల కోట్ల ఆస్తులున్న అదాని, మోడీ ముఖ్యమంత్రిగా పదవీ విరమణ చేసిన సమయానికి అతడి ఆస్తుల విలువ రూ.50వేల కోట్లకు పెరిగాయని, అలాగే మోడీ ప్రధానమంత్రి అయిన తర్వాత జాతీయస్థాయిలో ఎదిగిన అదాని ఎనిమిదేళ్లల్లో తన ఆస్తుల విలువ రూ.10లక్షలా 30 వేల కోట్లకు పెరిగిందని తెలిపారు. మోదీ, అమిత్‌షా దేశంలో 23కోట్ల మందిని నిరుపేదలుగా చేశారని తెలిపారు. 2014లో 410 ఉన్న గ్యాస్ ధర నేడు రూ.1150 పెరిగిందని మండిపడ్డారు. దేశంలో మోడీ పాలనకు స్వస్తి పలికాల్సిన అవసరం ఉందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజలకు అంతోకొంతో మేలు చేస్తున్న ప్రభుత్వానికి అడ్డుపడుతున్నారన్నారు. కేంద్ర ప్రభుత్వం గిరిజనులు అధిక శాతం ఉన్న నిర్మల్ జిల్లాకి గిరిజన విద్యాలయం ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించారు. కార్యక్రమంలో సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు ఆడివయ్య, జయలక్ష్మి, రాష్ట్ర కమిటీ సభ్యులు, బాలకష్ణ, అశయ్య, వెంకటేష్, దుర్గం నూతన్‌కుమార్, బొమ్మెన సురేశ్ పాల్గొన్నారు.

సభను అడ్డుకున్న పోలీసులు..

జిల్లా కేంద్రంలోని మున్సిపల్ కార్యాలయం ఎదుట ఏర్పాటు చేసిన సభను పోలీసులు అడ్డుకున్నారు. యాత్ర ప్రధాన ప్రచారకర్త రాష్ట్ర కార్యవర్గ సభ్యులు వీరయ్య మాట్లాడుతుండగానే పోలీసులు మైక్ కట్ చేయాలన్నారు. దీంతో సభలో కాసేపు గందరగోళం నెలకొంది. ఈ సందర్భంగా వీరయ్య పోలీసులతో వారించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. నిర్మల్‌లో సాయంత్రం ఐదు గంటల తర్వాత సభ నిర్వహించుకోవాలని డీజీపీ అనుమతి ఇచ్చారని తెలిపారు. అలాంటిది ప్రభుత్వ ఆఫీస్ పక్కనే ఉన్నందున కార్యకలాపాలకు ఆటంకం జరుగుతుందని సాకు చెబుతున్నారన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా పోలీసులంతా పనిచేస్తున్నారని మండిపడ్డారు. సభను అడ్డుకునేందుకు ప్రయత్నించిన పోలీసులను కార్యకర్తలు ప్రశ్నించగా కేసులు పెడతామని బెదిరించారని తెలిపారు. అనంతరం పోలీసులను 'సాక్షి' వివరణ కోరగా పక్కనే కలెక్టర్ కార్యాలయంలో సమావేశాలు ఉన్నందునా వారికి నచ్చచెప్పామని, సభలో మైక్ లేకుండా మాట్లాడాలని సూచించామని వివరణ ఇచ్చారు.

భక్తిభావం.. కఠిన ఉపవాసం

- దర్శనమిచ్చిన నెలవంక
- నేటి నుంచే రంజాన్ మాసం
- శుక్రవారం తొలి ఉపవాసం
- నెలరోజుల పాటు దైవ స్మరణే..


బెల్లంపల్లి బాబుక్యాంపులో ముస్తాబైన జామా మసీద్

నెన్నెల(బెల్లంపల్లి): ముస్లింలు అత్యంత పవిత్రంగా కఠోర నియమాలతో నెలరోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టే రంజాన్ మాసం నేటి నుంచి షురూ కానుంది. గురువారం సాయంత్రం ఆకాశంలో నెలవంక దర్శనమివ్వడంతో ఈ నెల 24న శుక్రవారం తెల్లవారు జామునుంచి మొదటి (రోజా) ఉపవాస దీక్షకు ముస్లింలు సిద్ధమయ్యారు. గురువారం రాత్రి నుంచే మసీదులలో ఖురాన్ పఠనం, తరావి నమాజ్ ప్రారంభమయ్యాయి. ఇందుకు జిల్లాలోని మసీదులను అందంగా ముస్తాబు చేశారు. వేకువ జామున ఉపవాస దీక్ష (సహర్) ప్రారంభించి సాయంత్రం దీక్ష విడిచే సమయం (ఇఫ్తార్) కోసం పట్టణాల్లో ప్రత్యేక వంటకాలు అందించేందుకు హోటళ్లు కూడా సిద్ధమయ్యాయి. ఇలా 30 రోజుల పాటు ఉపవాస దీక్షలు చేపట్టి మళ్లీ సాయంత్రం వినీల గగనంలో నెలవంకను చూసిన మరుసటి రోజు రంజాన్ జరుపుకుంటారు.

అతి పవిత్ర మాసం

ముస్లింల అతి పవిత్ర గ్రంథమైన దివ్య ఖురాన్ దివి నుంచి భువికి ఈ మాసంలోనే వచ్చిందని వారు విశ్వసిస్తారు. ఈ నెలలో ఉపవాస దీక్ష ద్వారా శరీరాన్ని సుక్షింపజేయడం ద్వారా ఆత్మప్రక్షాళన అవుతుందని వారి నమ్మకం. తద్వారా కామ, క్రోధ, మోహ, మద, మత్సార్యాలు అదుపులో ఉంటాయని నమ్మకం. ఉదయాన్నే అన్నపానీయాలు సేవించడాన్ని సహర్ అంటారు. సాయంత్రం ఉపవాస దీక్ష విరమించి భోజనాన్ని తీసుకోవడాన్ని ఇఫ్తార్ అంటారు.

30 రోజులను మూడు భాగాలుగా..

రంజాన్ మాసంలో 30 రోజులను మూడు భాగాలుగా విభజిస్తారు. మొదటి పది రోజులు రహమత్‌కే రోజాలు(కరుణ కురిపించే దినాలు), రెండో పది రోజులు మగ్ ఫిరత్‌కే రోజాలు(పాపాల నుంచి క్షమాపణ పొందే దినాలు), చివరి పది రోజులు జహన్నుమ్‌సే ఛుట్కారే రోజాలు(నరకదండన నుంచి విముక్తి కోరే దినాలు)గా పాటిస్తారు.

ప్రత్యేక నమాజ్

ప్రతిరోజు రాత్రి 8.30 నుంచి 10 గంటల వరకు ఈ మాసంలో ప్రత్యేకంగా తరావీ నమాజ్ చేస్తారు. దివ్యఖురాన్‌ను రోజుకు 20 రకాతుల చొప్పున తరావీనమాజ్‌లో 27 రోజుల పాటు హాఫిజ్ పాటిస్తారు. రంజాన్‌లో రాత్రి పూట ఇషా నమాజ్ అనంతరం తరావీనమాజ్ జరుగుతుంది. ఇలా 25 రోజుల తరావీనమాజ్ జరిపిన తర్వాత 26వ రోజు సబ్ ఏ ఖదర్ రాత్రి నుంచి ఈదు ఉల్‌ఫితర్ వరకు ఉపవాస దీక్షను ఆచరిస్తారు. ఇహలోకంలో ఆచరించే కఠోర దీక్షలు మనల్ని పరలోకంలో కాపాడుతాయని ముస్లింల ప్రగాఢ విశ్వాసం. రంజాన్ మాసంలో ఉపవాసాలు, ధానధర్మాలతో గడిపిన వారి ప్రార్థనలను అల్లాహ్ ఆలకిస్తాడని, వారి పాపాలు పరిహారమై అగ్నిసంస్కారం పొందిన బంగారం మాదిరి వారి మోము దివ్యకాంతిలో వెలుగుతుందని వారు విశ్వసిస్తారు.

స్వగ్రామానికి మతిస్థిమితం కోల్పోయిన గల్ఫ్ బాధితుడు


చిన్న రాజన్నను కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న ఎన్‌ఆర్‌ఐ బంధువులు

లక్ష్మణచాంద: ఎట్టకేలకు మతిస్థిమితం కోల్పోయి గల్ఫ్ దేశంలోనే ఉండిపోయిన వ్యక్తి స్వగ్రామానికి చేరుకున్నాడు. వివరాల్లోకి వెళితే... మండల కేంద్రానికి చెందిన ఏంజలి చిన్న రాజన్న గత పది సంవత్సరాలుగా గల్ఫ్ దేశం ఉపాధి నిమిత్తం వెళ్తున్నాడు. ఏడాది క్రితం ఇంటికి వచ్చి మళ్లీ వెళ్లాడు. అక్కడ పనిచేసే క్రమంలో ఉపాధి కోల్పోయాడు. దీంతో ఇంటికి వచ్చేందుకు చేతిలో డబ్బులు లేకపోవడంతో మతిస్థిమితం కోల్పోయి అక్కడే తిరుగుతున్నాడు. దీంతో అదే సమయంలో సోన్ మండలంలోని జాఫ్రాపూర్ గ్రామానికి చెందిన ఎన్‌ఆర్‌ఐ హైమద్ గమనించి మతిస్థిమితం లేని వ్యక్తిని చూపి వివరాలు సేకరించాడు. వెంటనే లక్ష్మణచాంద సర్పంచ్ ముత్యం రెడ్డికి ఫోన్‌లో సమాచారం ఇచ్చాడు. దీంతో స్పందించిన సర్పంచ్ ముత్యం రెడ్డి ఎలాగైనా తమ గ్రామవాసిని ఇక్కడకు పంపే ఏర్పాట్లు చేయాలని హైమద్‌ను విజ్ఞప్తి చేశాడు. సర్పంచ్ విజ్ఞప్తితో హైమద్ అక్కడ ప్రభుత్వంతో మాట్లాడి ఎట్టకేలకు గురువారం సాయంత్రం లక్ష్మణచాందలోని చిన్న రాజన్నను తన ఇంటికి చేర్చారు. దీంతో కుటుంబ సభ్యులు ఎన్‌ఆర్‌ఐ హైమద్‌కు, సర్పంచ్‌కు కృతజ్ఞతలు తెలిపారు.

రైతుల పంటను పూర్తిస్థాయిలో కొనాలి


శనగ పంటను పరిశీలిస్తున్న ప్రధాన కార్యదర్శి సుజాత

- టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత

ఆదిలాబాద్‌అర్బన్: రైతుల పండించిన పంటలను పూర్తిస్థాయిలో కొనుగోలు చేయాలని టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత అన్నారు. గురువారం సాయంత్రం ఆమె స్థానిక మార్కెట్‌ను సందర్శించారు. శనగ కొనుగోలు ప్రారంభించినప్పటికీ గన్నీ బ్యాగులు లేక, సాంకేతిక సమస్యతో కొనుగోలు నిలిచిపోయిందన్నారు. వాతావరణంలో మార్పులు రావడం, అక్కడక్కడ వర్షాలు సైతం కురుస్తుండడంతో రైతులు ఆందోళన చెందుతున్నారన్నారు. మార్కెట్‌లో రైతులకు కనీస సౌకర్యాలు లేవని, పంటను అమ్ముకోవడానికి వచ్చిన రైతన్నలు రాత్రి నుంచే పడిగాపులు కాయాల్సి వస్తుందన్నారు. నీళ్ల, నీడ, భోజనం వంటి కనీస వసతులు సైతం కల్పించడంలో ప్రభుత్వం విఫలమవుతోందన్నారు. హైబ్రిడ్ రకం వచ్చాక దిగుబడులు పెరిగాయని, అధిక దిగుబడినిచ్చే విత్తన రకాలతో దిగుబడులు పొందేలా రైతులను ప్రోత్సహించాలని, కానీ ఇలా నీరుగార్చేలా ఆరు క్వింటాళ్ల 23 కిలోలు కొనుగోలు చేస్తామనడం సమంజసం కాదన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వాలు స్పందించి రైతులకు ఇబ్బందులు కలగకుండా వసతులు కల్పించాలని కోరారు. ఆమె వెంట యూత్ కాంగ్రెస్ అసెంబ్లీ జనరల్ సెక్రటరీ సామ రూపేష్ రెడ్డి, రైతులు తదితరులు ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్ర వాసి మృతి

జైనథ్: మండల కేంద్రానికి కూతవేటు దూరంలో జాతీయ రహదారిపై ఐబీ చౌరస్తా వద్ద గురువారం ఉదయం జరిగిన రోడ్డు ప్రమాదంలో మహారాష్ట్రలోని యవత్‌మాల్ జిల్లా వణి తాలుకా బోర్డా గ్రామానికి చెందిన గొబాడే బాపూరావ్ (60) మృతి చెందాడు. పోలీసుల, స్థానికుల కథనం ప్రకారం... బాపూరావ్ ఉదయం మహారాష్ట్ర నుంచి జైనథ్ మీదుగా బేల మండలంలోని తన మిత్రుడిని కలవడానికి బైక్‌పై బయలుదేరాడు. 10గంటల ప్రాంతంలో ఐబీ చౌరస్తా సమీపానికి చేరుకోగానే బైక్ అదుపుతప్పి పడిపోయాడు. దీంతో అతడి తలకు, కాళ్లకు తీవ్ర రక్తగాయాలయ్యాయి. స్థానికుల సమాచారంతో 108 సిబ్బంది చేరుకుని పరిశీలించారు. అప్పటికే బాపూరావ్ మృతి ధ్రువీకరించారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతుడి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. మృతదేహాన్ని జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించాడు. కుమారుడు సతీష్ ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు ప్రారంభించినట్లు పోలీసులు తెలిపారు.

శిశువు పాల కోసం ఆవును కొనిచ్చిన అధికారులు


కొనిచ్చిన అవుతో పశువైద్యశాఖ అధికారులు, ఎస్సై

ఇంద్రవెల్లి: ఆదిలాబాద్ మండలం చిచ్‌ధర్‌ఖానాపూర్ గ్రామపంచాయతీ పరిధి గూడ గ్రామానికి చెందిన కోడప పారుబాయి జనవరి 10న రిమ్స్ ఆస్పత్రిలో ఆడ శిశువును ప్రసవించి మృతి చెందింది. తల్లి మృతి చెందగా శిశువు ఆలనాపాలన తండ్రి కోడప జంగుబాపు, కుటుంబ సభ్యులు చూస్తున్నారు. బిడ్డకు పాలు లేక కుటుంబీకులు పడుతున్న ఇబ్బందులు తెలుసుకున్న పశువైద్యశాఖ డీవీఏహెచ్‌వో కిషన్ గురువారం చిన్నారి కుటుంబ సభ్యులను ఇంద్రవెల్లి మండలకేంద్రానికి రప్పించారు. శిశువుకు అవసరమైన పాల కోసం ఆవు, దూడను కొనుగోలు చేసి వారికి అందించారు. చిన్నారికి ఎలాంటి సమస్య రాకుండా చూస్తామని తెలిపారు. ముందుగా ఇంద్రవెల్లి ఎస్సై డీ సునీల్‌రాజు గూడ గ్రామాన్ని సందర్శించి చిన్నారికి పాలతో పాటు నిత్యావసరాలు పంపిణీ చేశారు. చిన్నారికి ఎలాంటి సమస్య వచ్చినా తనకు సమాచారం ఇవ్వాలని కుటుంబ సభ్యులను కోరారు. పశువైద్య సిబ్బంది అనిల్ కుమార్ తదితరులున్నారు.